క్లుప్తంగా

కిడ్నీ బాధితునికి డిగ్రీ కళాశాల వితరణ

అమలాపురం టౌన్: కిడ్నీ బాధితుడిని ఆదుకునేందుకు అమలాపురం శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు తమ వంతుగా స్పందించి రూ.45 వేలు సమకూర్చారు. అల్లవరానికి చెందిన పోతుమూడి ప్రేమ్ చంద్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. బాధితుడి తండ్రి శ్రీనుకు కళాశాలలో రూ.45 వేల మొత్తాన్ని యాజమాన్యం అందజేసింది. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేవీఆర్ఎస్ నరసింహరావు, ప్రిన్సిపాల్ కె.మనోహర్ పాల్గొన్నారు.

చైతన్యవంతంగా 'గెయిల్' బుర్రకథ



బుర్రకథ చెబుతున్న కళాకారులు

అమలాపురం టౌన్: గెయిల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో స్థానికంగా ఓ హోటల్‌లో ఆ సంస్థ తమ కార్యకలాపాల్లో భాగంగా ఏర్పాటు చేసిన పైపులైన్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం ప్రదర్శించిన బుర్రకథ చైతన్యవంతంగా సాగింది. గొర్రెల రాము, కృష్ణ బ్రదర్స్ ఈ బుర్ర కథను వినిపించారు. తొలుత మహాభారతంలోని ఉత్తర కల్యాణం కథతో ప్రారంభించి తర్వాత గెయిల్ పైపులైన్లు, వాటి రక్షణపై కళాకారుల బృందం వివరించింది. పైపులైన్లలో ఏర్పాటు చేసిన వాల్వులు, యంత్రాలు, హెచ్చరిక బోర్డులు, చిహ్నాలను సూచించే స్తంభాలను ప్రజలు గమనించాలని సూచించింది. గెయిల్ సంస్థ అమలు చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను తెలిపింది. తాటిపాక గెయిల్ బేసిన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో నిర్వహించారు.

వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడిగా దేవాదుల



అమలాపురం టౌన్: జిల్లా చేతి వృత్తి సంక్షేమ సంఘం అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. హైదరాబాద్‌లో ఈ నెల 15న జరిగిన పార్టీ ప్రథమ మహాసభలో జాతీయ కన్వీనర్ రాయబండి పాండురంగాచారి చేతుల మీదుగా తాను రాష్ట్ర అధ్యక్ష పదవి నియామక పత్రాన్ని అందుకున్నట్లు సూర్యనారాయణమూర్తి అమలాపురంలో శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

అమలాపురం స్వర్ణకార సంఘం ప్రమాణ స్వీకారం



ప్రమాణం స్వీకారం చేసిన కార్యవర్గ ప్రతినిధులు

అమలాపురం టౌన్: పట్టణ స్వర్ణకార సంక్షేమ సంఘానికి ఎన్నికైన నూతన కార్యవర్గం స్థానిక గోల్డ్ మార్కెట్‌లోని కామాక్షీ ఏకాంబరేశ్వరీ దేవి ఆలయం వద్ద శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసింది. సంఘ అధ్యక్షుడిగా భరణికాన బాబు, కార్యదర్శిగా ఓడూరి ఫణికుమార్, కోశాధికారిగా చింతా నాని ప్రమాణం చేశారు.

పవర్ లిఫ్టింగ్ ట్రోఫీల ఆవిష్కరణ



ట్రోఫీలను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణ పద్మరాజు తదితరులు

అమలాపురం టౌన్: అమలాపురంలో జరగనున్న తోరం రమేష్ మెమోరియల్ పవర్ లిఫ్టింగ్ పోటీల చాంపియన్ షిప్ ట్రోఫీలను స్థానిక హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు శుక్రవారం ఆవిష్కరించారు. తోరం రమేష్ మెమోరియల్ పేరిట మూడో యునైటెడ్ ఈస్ట్ గోదావరి పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ మెన్ అండ్ వుమెన్ పోటీలు ఈ నెల 22న స్థానిక రాజరాజేశ్వరిస్వామి కల్యాణ మంటపంలో నిర్వహిస్తున్నట్లు ఆ జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరావు తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి దాదాపు 150 మంది క్రీడాకారులు పాల్గొంటారని డాక్టర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు చిక్కం రాజబాబు, పొనకల దుర్గాప్రసాద్, చీకురుమిల్లి కిరణ్‌కుమార్, ఎంపీ సముద్రం, గంగుమళ్ల దొరబాబు పాల్గొన్నారు.

పుల్లేటికుర్రులో చోరీ

అంబాజీపేట: పుల్లేటికుర్రులో చోరీ జరిగింది. ఎస్సై ఎ.చైతన్యకుమార్ ప్రకారం.. ఆ గ్రామ మెయిన్ రోడ్డులో కొత్తపల్లి నాగేశ్వరరావు ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. 20 రోజుల కిందట హైదరాబాద్‌లో ఉన్న తన కుమారుడిని చూసేందుకు వెళ్లారు. శుక్రవారం తిరిగి వచ్చిన నాగేశ్వరరావు ఇంట్లో 25 గ్రాముల బంగారు ఉంగరాలు, గొలుసు, 4 వెండి గ్లాసులు, 2 వెండి పట్టీలు అపహరణకు గురయ్యాయని గుర్తించారు.

కాళీమాతా.. నమోస్తుతే

- శ్రీలంక నుంచి ఓడపై వచ్చి పూజలందుకుంటున్న దేవత
- కోల్‌కతా శ్రీ మహాకాళీమాతను తలపించే విగ్రహం
- శరన్నవరాత్రులలో అమ్మవారికి విశేష అర్చనలు



శ్రీ మహాకాళీమాత

తాళ్లరేవు: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పూజలందుకుంటున్నారు కోరంగి పంచాయతీ సీతారామపురం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ మహాకాళీ మాత అమ్మవారు. కోల్‌కతాలోని శ్రీ మహాకాళీ మాత విగ్రహాన్ని తలపించేవిధంగా ఉన్న ఈ అమ్మవారిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. ముఖ్యంగా శరన్నవరాత్రులలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తారు. పదిరోజులపాటు అమ్మవారికి అర్చనలు, కుంకుమ పూజలు చేస్తారు. తాళ్లరేవు పరిసర ప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. సుమారు 200 ఏళ్ల క్రితం శ్రీలంక నుంచి ఇండియాకు ఓడలో వచ్చి నేటికీ పూజలందుకుంటున్న కాళికామాత అమ్మవారికి విశేష చరిత్ర ఉంది.

ఆలయ చరిత్ర...

పూర్వకాలంలో కోరంగి ప్రాంతం గొప్ప నౌకా నిర్మాణ కేంద్రంగా ఉండేది. శ్రీలంక, ఇరాన్, ఇరాక్, దుబాయ్, బర్మా తదితర దేశాల నుంచి ఓడల నిర్మాణానికి ఇక్కడకు తరలివచ్చేవారు. శ్రీలంకకు చెందిన జాఫ్నా జిల్లావాసి సుందరం పిళ్లై సోఫ్ కప్పల్ అనే తన ఓడతో వ్యాపారం కోసం ఇండియా వస్తుండగా, కొలంబియా సముద్ర గర్భం నుంచి కాళీమాత విగ్రహం ఉద్భవించినట్లు ఆలయ వంశపారంపర్య 4వ ధర్మకర్త పెమ్మాడ కాశీ విశ్వనాథం తెలిపారు. అమ్మవారు ఎనిమిదేళ్ల బాలిక రూపంలో నల్లని వస్త్రాలు ధరించి తన ఓడమీద దర్శనం ఇచ్చారన్నారు. తమ వంశీకులు కోల్‌కతా నుంచి వేద పండితులను రప్పించి 1809వ సంవత్సరంలో శాంతి యంత్ర ప్రాణ ప్రతిష్ఠ చేశారని తెలిపారు. ఈ ఆలయం 1932లో సంభవించిన పెనుతుపాను కారణంగా శిథిలస్థితికి చేరగా పెమ్మాడి తాతబ్బాయి ప్రస్తుతమున్న దేవాలయాన్ని నిర్మించారు.

కోరిన కోర్కెలు తీర్చే మహాశక్తి స్వరూపిణి



సీతారామపురం శ్రీ మహాకాళీ మాత కోరిన కోర్కెలు తీర్చే మహా శక్తి స్వరూపిణిగా విరాజిల్లుతున్నారు. ఎంతో చరిత్ర ప్రసిద్ధిగాంచిన అమ్మవారిని దర్శించినంతనే సకల పాపాలు పటాపంచలై కోరికలు నెరవేరుతాయి. మా పూర్వీకుల నుంచి అమ్మవారి సేవ చేసుకుంటున్నాం.

– పెమ్మాడ కాశీవిశ్వనాథం, ఆలయ వంశపారంపర్య 4వ ధర్మకర్త

ఒకటి నుంచి గడపగడపకూ ప్రచారం

'ఆంధ్రప్రదేశ్‌కి జగన్ ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో మంత్రి విశ్వరూప్ పిలుపు





సమావేశానికి హాజరైన నాయకులు. కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: 'ఆంధ్రప్రదేశ్‌కి జగన్ ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో నవంబర్ ఒకటో తేదీ నుంచి గడపగడపకూ ప్రచారం చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 52 నెలల పాలనలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి పార్టీ నాయకులు, వలంటీర్లు, గృహ సారథులతో కలిసి ఈ ప్రచారం నిర్వహించాలన్నారు. ఇందుపల్లి గ్రామంలో ఏ వన్ కన్వెన్షన్ సెంటర్‌లో రూరల్ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి అధ్యక్షతన రూరల్ పార్టీ నాయకులు, వలంటీర్లు, గృహసారథులతో కలిసి 'ఆంధ్రప్రదేశ్‌కి జగన్ ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులకు దిశా నిర్దేశం చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, పార్టీ, భేదాలు లేకుండా ప్రతి ఒక్కరికి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని అన్నారు. సచివాలయ పరిధిలో మండల నాయకులు, సచివాలయ కన్వీనర్, గృహసారథులతో వలంటీర్ పరిధిలోకి 50 కుటుంబాల వద్దకు వెళ్లి ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం ద్వారా లబ్ధిదారులకు సీఎం జగన్ చేసిన అభివృద్ధిని, అందించిన సంక్షేమాన్ని పార్టీ నాయకులతో కలసి ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో చంద్రబాబు ప్రజలను ఎలా మోసం చేశాడో వివరించాలన్నారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ విద్యావ్యవస్థను సమూలంగా మార్చివేసి నాణ్యమైన విద్యను అందించినందుకు జగనే కావాలి, ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని ఇంటి వద్దకే అందిస్తున్న ముఖ్యమంత్రి జగనే మళ్లీ కావాలి అన్నారు. పింఛన్ల పెంపు, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, డ్వాక్రా చెల్లెమ్మలకు రుణమాఫీ, నాలుగు లక్షల శాశ్వత ఉద్యోగాలు కల్పన వంటివి ప్రచారం చేయాలన్నారు. ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు, డీసీసీబీ డైరెక్టర్ యిళ్ల గోపాలకృష్ణ, వైస్ ఎంపీపీ పొలమూరి బాలకృష్ణ, గృహ సారథుల మండల కన్వీనర్ చొల్లంగి సుబ్బిరామ్, ఏఎంసీ మాజీ చైర్మన్ బొక్కా ఆదినారాయణ, జిల్లా కార్యదర్శి సరెళ్ల రామకృష్ణ, సచివాలయ కన్వీనర్ ఈతకోట శ్రవణ్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ దాడులపై సీపీఎం నిరసన

అమలాపురం టౌన్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దమనకాండను జిల్లా సీపీఎం శాఖ ఖండించింది. ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ ఆ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరులో శుక్రవారం ధర్నా నిర్వహించారు. పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు అంగ్ర మాల్యాద్రి ముఖ్య అతిథిగా పాల్గొని యుద్ధాన్ని ప్రేరేపిస్తున్న అమెరికా తీరును ప్రపంచ దేశాలు ఖండించాలన్నారు. జి.దుర్గాప్రసాద్, ఎస్.బలరామ్, పీతల రామచంద్రరావు, వి.రాంబాబు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి



రెల్లుగడ్డలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో శ్రీకాంత్

అల్లవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనతో ఈ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధిని సాధించగలదని వైఎస్సార్ సీపీ నాయకుడు పినిపే శ్రీకాంత్ అన్నారు. మండల నోడల్ అధికారి కృష్ణమోహన్, సర్పంచ్ నడింపల్లి వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో రెలుగడ్డ పంచాయతీ పరిధిలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి నాలుగేళ్ల కాలంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేయాలని శ్రీకాంత్ పిలుపునిచ్చారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, బీసీ సెల్ అధ్యక్షుడు యల్లమిల్లి బోసు, సర్పంచ్‌లు రాకాపు విజయలక్ష్మి, బర్రే సీతారత్నం, ఎంపీటీసీ సభ్యుడు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు కుంచే వెంకటేశ్వరరావు, బొంతు సత్యనారాయణ, బళ్ల శ్యామ్ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి భరోసా

తాళ్లరేవు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల ఆరోగ్యానికి భరోసా ఏర్పడుతుందని ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ అన్నారు. శుక్రవారం పి.మల్లవరం గ్రామ పంచాయతీకి సంబంధించి స్థానిక హైస్కూల్‌లో జరిగిన సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గాడిమొగ, తాళ్లరేవు పీహెచ్‌సీ వైద్యులు జయభార్గవి, ఈశ్వర్, సురేష్ 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మెరుగైన వైద్యం కోసం తొమ్మిది మందిని కాకినాడ రిఫర్ చేశారు. అనంతరం శివన్నారాయణ చేతుల మీదుగా రోగులకు ఉచితంగా మందులు, గర్భిణులకు పౌష్టికాహార కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ దున్నా సత్యనారాయణ, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, ఈఓపీఆర్‌డీ ఎం.భైరవమూర్తి, పంచాయతీ కార్యదర్శి సూరంపూడి వెంకటరమణ, ఉప సర్పంచ్ పంపన రామకృష్ణ పాల్గొన్నారు.

ఎస్.పల్లిపాలెంలో ఆరోగ్య సురక్ష శిబిరం

అల్లవరం: ప్రజలందరికి నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఎస్.పల్లిపాలెంలో శుక్రవారం నిర్వహించారు. సర్పంచ్ కొల్లు వెంకటరమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ప్రతి ఒక్కరికి వైద్యం అందించాలన్నారు. మండల పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ, గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, తహసీల్దార్ సాంబశివప్రసాద్, పీఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు, కార్యదర్శి శ్రీరామచంద్రమూర్తి, డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేషగిరిరావు

జగనన్న ప్రభుత్వంలోనే మెరుగైన వైద్యం

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు అన్నారు. మండలంలోని గోపవరం గ్రామంలో గోపవరం, సరిపల్లి గ్రామ సచివాలయ పరిధిలో కుంచే బుల్లియ్య అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. 435 మందికి సిబ్బంది వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందించారు. 136 మందికి కళ్ల పరీక్షలు చేశారు. 81 మందికి ఉచితంగా కళ్లజోళ్లను అందిస్తామని వైద్య సిబ్బంది తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, యువజన విభాగం మండల అధ్యక్షుడు ఓగూరి విజయ్‌కుమార్, కుంచే స్వామి, డీటీ వైపీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, వైద్యులు లోవసుధ, ఢిల్లీ ప్రసాద్, శ్రీహరి, కుమార్, నాగార్జున పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు రుణాలు ఇవ్వాలి

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో ఉన్న డ్వాక్రా మహిళలకు ఒక్కో గ్రూపునకు గతంలో రూ.5 లక్షల చొప్పున రుణాలు ఇచ్చేవారని, కాని ప్రస్తుతం ఆ మొత్తం సభ్యులకు ఏవిధంగాను సర్దుబాటు కాకపోవడంతో ప్రతి గ్రూపునకు రూ.పదిలక్షలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. శుక్రవారం డీఆర్‌డీఏ అర్బన్ అధికారిణిని కలిసి రుణాల మంజూరు గురించి చర్చించారు. గతంలో 23 గ్రూప్‌లకు రుణాలు ఇచ్చారని, ప్రస్తుతం 438 గ్రూప్‌లకు అందించాలని కోరారు.

ఘనంగా నా మట్టి – నా దేశం

అల్లవరం: ఆజాదీ కా అమృత్ మహోత్సవం ముగింపు సందర్భంగా అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో నా మట్టి నా దేశంపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్రం (కాకినాడ) ఆధ్వర్యంలో ఎంపీడీఓ కృష్ణమోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల సేవలను గుర్తు చూసుకుంటూ వారికి ఘనంగా నివాళలర్పించారు. మండలంలోని పలు గ్రామాల్లో సేకరించిన మట్టిన కలశాల్లో వేసి మండల పరిషత్ సమావేశ మందిరానికి తీసుకొచ్చారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, వైస్ ఎంపీపీ ముత్యాల వెంకటరామకృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరీ, సుంకర సాయి, పరిపాలనాధికారి లక్ష్మణరావు, ఏపీఓ శ్రీనుబాబు పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో ర్యాలీ

ముమ్మిడివరం: నెహ్రూ యువక కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ముమ్మిడివరంలో మేరీ మట్టి–మేరా దేశ్ (నా మట్టి–నా దేశం) ర్యాలీని నిర్వహించారు. నెహ్రూ యువక కేంద్రం వలంటీర్ బండారు దేవి వెంకటేశ్వరి శిరీషా ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీని ఎంపీడీఓ జె.రాంబాబు జెండా ఊపి ప్రారంభించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ దేశ ఔన్నత్యాన్ని, సమగ్రతను, స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలను నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం నా మట్టి–నా దేశం ఔన్నత్యాన్ని చాటుతూ స్థానిక పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ బి.రమణశ్రీ, జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శివశంకరరావు, కోలా బాబ్జీ, మోకా రామారావు, కన్నీడి వెంకటేశ్వరరావు, నెహ్రూ యువక కేంద్రం వలంటీర్ భవానీ శంకర్ పాల్గొన్నారు.



కలశాలతో మట్టిని తీసుకొస్తున్న ఎంపీపీ శేషగిరిరావు, దొరబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాంబాబు

చెకుముకి సైన్స్ సంబరాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

అమలాపురం రూరల్: జన విజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ సంబరాలు వాల్‌పోస్టర్‌ను శుక్రవారం కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆవిష్కరించారు. కలెక్టర్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వేదిక అధ్యక్షుడు, చెకుముకి సైన్స్ మాసపత్రిక ఎడిటోరియల్ బోర్డు మెంబర్ డాక్టర్ ఈ.ఆర్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 33 సంవత్సరాలుగా జన విజ్ఞాన వేదిక విద్యార్థులు శాస్త్రీయ జీవన విధానం అలవర్చుకునేందుకు కృషి చేస్తోందన్నారు. నవంబరు10న పాఠశాల స్థాయి, 30న మండల, పట్టణ స్థాయి, డిసెంబర్ 17న జిల్లా స్థాయి, 2024 జనవరి 27, 28 తేదీలలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తామని సుబ్రహ్మణ్యం అన్నారు. చెకుముకి సైన్సు సంబరాలను రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో నిర్వహించాలని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు ఇచ్చారని జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాజా మొహిద్దిన్ తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, జిల్లా కోశాధికారి జి.త్రినాథ్ కుమార్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు

యూటీఎఫ్ నిరశన

ముమ్మిడివరం: సీపీఎస్, జీపీఎస్ వద్దు –ఓపీఎస్ ముద్దు అనే నినాదంతో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం ముమ్మిడివరంలో నిరాహార దీక్షలు చేశారు. శిబిరాన్ని జిల్లా కార్యదర్శి టి.దుర్గాప్రసాద్ ప్రారంభించారు. ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాల సీపీఎస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడా రంగ నైపుణ్యాలను అభివృద్ధి చేయాలి



క్రీడాకారులకు కిట్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: యానాంలో ఉన్న క్రీడాసౌకర్యాలను సద్వినియోగం చేసుకుని తమ క్రీడా నైపుణ్యాలను పెంచుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. శుక్రవారం డాక్టర్ వైఎస్సార్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) అకాడమీలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్స్‌ను అందజేశారు. స్విమ్మింగ్, వాలీబాల్, బాడ్మింటన్ తదితర క్రీడల్లో సుమారు 24 మంది క్రీడాకారులకు ఒక్కోక్కటి రూ.5వేలు విలువచేసే కిట్‌ను ఎమ్మెల్యే అశోక్ అందజేశారు. సాయ్ ఇన్‌చార్జి లింగేశ్వరరావు, కోచ్‌లు రాజేష్, ఉదయ్, సిబ్బంది భద్ర, దత్తు పాల్గొన్నారు.

రేపు ఫీల్డ్ సూపర్‌వైజర్ పోస్టులకు రాత పరీక్ష

యానాం: డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ శాఖ పరిధిలోని ఖాళీగా ఉన్న ఫీల్డ్ సూపర్‌వైజర్ పోస్టులకు ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు రాతపరీక్ష నిర్వహిస్తున్నట్లు డీపీ అండ్ ఆర్ కార్యదర్శి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రవాణాశాఖలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ పోస్టుకు పరీక్ష జరుగుతుందన్నారు. 2,773 మంది ఫీల్డ్ సూపర్‌వైజర్ పోస్టులకు, 578 మంది ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ పోస్టులకు యానాం, మాహే, పుదుచ్చేరి, కారైకల్‌కు చెందినవారు హాజరుకానున్నారన్నారు. పుదుచ్చేరిలో 7 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. హాల్‌టికెట్‌తో పాటు ఆధార్, పాన్ వంటి గుర్తింపుకార్డులు తెచ్చుకోవాలన్నారు.

సరస్వతీ దేవిగా అమ్మవారు



సన్నవిల్లిలో సరస్వతీ దేవి అలంకరణలో కనకదుర్గ అమ్మవారు



నీలపల్లిలో సరస్వతీదేవిగా పూజలందుకున్న అమ్మవారు



మహా సరస్వతీదేవిగా అమలాపురం శ్రీదేవి అమ్మవారు



చినకొత్తలంకలో సరస్వతీదేవిగా అమ్మవారు

ముమ్మిడివరం: శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం గోదశివారిపాలెంలో విజయ దుర్గమ్మవారు సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చినకొత్తలంక విజయ దుర్గమ్మ వారిని సరస్వతీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఐ.పోలవరం: మండలంలోని 14 గ్రామాల్లో శుక్రవారం శరన్నవరాత్ర ఉత్సవ శిబిరాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆరో రోజు అమ్మవారు సరస్వతీ దేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారి ఆలయాల వద్ద వేకువ జామునే అధిక సంఖ్యలో మహిళలు భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజలు, వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని కొమరగిరి, మురమళ్ల, కేశనకుర్రు, జి.మూలపొలం, టి.కొత్తపల్లి, ఐ.పోలవరం గ్రామాల్లో ఆలయాల వద్ద విద్యుత్ దీపాలంకరణ చేశారు. కేశనకుర్రులో వేంచేసిన కామేశ్వరి అమ్మవారికి భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు.

తాళ్లరేవు: తాళ్లరేవు ప్రధాన రహదారిలో వేంచేసియున్న శ్రీ కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి చిన్నారులచే సరస్వతీ పూజను జరిపించారు. జార్జీపేట, కోరంగి గ్రామాల్లో వేంచేసియున్న శ్రీ దుర్గా మల్లేశ్వరి తదితర ఆలయాల్లో విశేష పూజలు చేశారు. నీలపల్లిలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కంచర్ల వెంకన్నబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంటపంలో వేద పండితులు ఖండవిల్లి రాజేశ్వర ప్రసాదాచార్యులు అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి, అభిషేకాలు, అర్చనలు చేసిన అనంతరం నవకన్య పూజను భక్తి శ్రద్ధలతో జరిపించారు. ఆయా కార్యక్రమాలలో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అమలాపురం టౌన్: స్థానిక శ్రీదేవి ఆలయంలో అమ్మవారు ఆరో రోజు శుక్రవారం మహా సరస్వతీ దేవిగా అలంకృతమై భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గల శ్రీ వైష్ణవీ కనకదుర్గ ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. హౌసింగ్ బోర్డు కాలనీలో గల శ్రీ కల్యాణ కనకదుర్గ ఆలయంలో అమ్మవారు శ్రీ మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు.

ఉప్పలగుప్తం: మండలంలోని సన్నవిల్లి గ్రామంలో వేంచేసి ఉన్న కనకదుర్గ అమ్మవారికి శరన్నవరాత్రులలో భాగంగా శుక్రవారం సరస్వతీదేవి అలంకరణ చేశారు. పెన్నులు, పుస్తకాలతో అమ్మవారిని అలంకరించి అందంగా తీర్చిదిద్దారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలను అందజేశారు. చినగాడవిల్లి వైష్ణవీదుర్గ ఆలయంలో సామూహిక కుంకుమార్చనలు చేసి, నైవేద్యాలు చెల్లించారు.

అమ్మవారి అలంకరణ అద్భుతం

అమలాపురం టౌన్: అమలాపురంలో వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారిని రూ.2.50 కోట్ల కరెన్సీ నోట్లతో శ్రీమహాలక్ష్మీదేవిగా అలంకరించడం అద్భుతంగా ఉందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. వాసవీ మాత ఆలయాన్ని మంత్రి విశ్వరూప్, బేబీ మీనాక్షి దంపతులు, కలెక్టర్ హిమాన్షు శుక్రవారం వేర్వేరుగా దర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని రూ.కోట్ల నోట్లతో అలంకరించిన కన్యకా పరమేశ్వరిదేవి ఆలయ ఉత్సవ కమిటీని, పట్టణ వైశ్య సంఘాన్ని వారు అభినందించారు. పట్టణ వైశ్య సంఘ నాయకులు యెండూరి నాగేశ్వరరావు, వరదా సూరిబాబు, నూలు కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ పినిపే శ్రీకాంత్, వంకాయల కాశీ పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: అమలాపురం పట్టణం గాంధీనగర్‌లో వేంచేసి ఉన్న కనకదుర్గా అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్ర మహోత్సవాల సందర్భంగా శుక్రవారం చండీ హోమం జరిగింది. తిక్కిరెడ్డి విష్ణుమూర్తి కుటుంబ సభ్యులు చండీహోమం నిర్వహించారు. 200 మంది మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. కర్రి రామస్వామి రత్నకుమారి దంపతుల ఆధ్వర్యంలో సామూహిక సరస్వతి పూజ నిర్వహించి విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందించారు. ఆలయ కమిటీ చైర్మన్ తిక్కిరెడ్డి ఆదినారాయణ పర్యవేక్షించారు.

యానాం: యానాంలో కొలువైన శ్రీశారదాదేవి ఆలయంలో సామూహిక సరస్వతీ పూజ శుక్రవారం ఘనంగా జరిగింది. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సకల కళలకు, విద్యలకు చతుర్వేదాలకు అక్షర స్వరూపిణియగు సరస్వతీ అమ్మవారికి విద్యార్థులు పూజలు నిర్వహించారు.